


"ఏదీ ఇంతకీ ఆ బోర్డు కనిపించదే ? ఇన్ని బజార్లు తిరిగినా పొద్దుట్నించీ ఒక్క ఇంటి ముందైనా ఆ పవిత్రమైన బోర్డు కనిపించలేదే !" అన్నాడు బ్రహ్మానందం నావంక దిగులుగా చూస్తూ!

పాపం వాణ్ణి చూసేసరికి నాకూ జాలేసింది. పైగా, వాడు సంతోషం వచ్చినా అణుచుకోలేడు. దుఃఖం వచ్చినా దిగమింగుకోలేడు. అలాంటివాడు బ్రహ్మానందం !

అయినా, వాణ్ణనుకొని ఏం లాభం ! ఆరోజు అటువంటిది. ప్రొద్దున్నే లేచి ఎవరి మొహం చూశామో ! కనీసం ఒక్క ధర్మాత్ముడైనా, ఒక్క దయామయుడైనా యీ మహానగరంలో "రూమ్ టు లెట్" అన్న బోర్డు బయట పెట్టలేదే ! ఇంత పగవాళ్లయినారా యీ బ్రహ్మచారులు !

ఆరోజు ఉదయాన కాఫీ తాగి బయల్దేరాం రూములు వెతుక్కోవటం కోసం. బజారు బజారూ తిరిగాం ! కాస్త గంభీరంగా కనుపించిన ప్రతి పెద్ద మనిషినీ అడిగాం,— వాళ్లింట్లో రూములేమైనా ఖాళీగా వున్నాయేమోనని ! "వూఁ సరే, ఇదిగో నయ్యా" అన్న పుణ్యాత్ముడే కనుపించలేదు !

ఆ పేటలో వున్న ప్రతి బజారు, ప్రతి గొందీ, ప్రతి సందూ తిరిగాం! ప్రతి ఇంటివైపూ అపాద మస్తకం ఆశగా చూచి, నిరాశతో తలలు దించేసుకున్నాం.

కాలం, ఖర్మం కలిసి రావాలి దేనికైనా ! ఉన్న 'రూము'లోనే కాస్త ప్రశాంతంగా వుందామనుకుంటే ఆ యజమానిక్కూడా ఇప్పుడే మారాలీ బుద్ధి ! ఏం మొహమాటం లేకుండా పిలిచి చెప్పాడు, 'వారం తిరిగేలోగా ఖాళీ చెయ్యండని.'

"ఒరే ! బ్రహ్మానందం !"

వాడీ లోకంలోనే లేడు.

మళ్లీ పిలిచాను "ఒరేయ్ బ్రహ్మ !"

ఆశగా తిరిగాడు నావైపు : "చెప్పరా చెప్పరా చెప్పు ! ఏదీ బోర్డేమైనా కనుపించిందిరా ! చెప్పేయ్ త్వరగా, ఇవ్వాళే వచ్చి చేరదాం." అన్నాడు. వాడి ఆశ వాడిది.

"అది కాదురా ! ఇక ఇవ్వాళ్టికి ఇంటికి పోదాం. మళ్లీ రేపొద్దాం" ప్రాధేయ పడుతూ అడిగాను.

"ఛ ! ఛ ! నామర్దారా. మూడు గంటలసేపు తిరిగి, కనీసం ఒక్క రూము అయినా — పోనీ, ఒక 'టు లెట్' బోర్డయినా ...... చూడకుండా పోవటం, ఛ ! ఛ! డామ్ ఇన్సల్ట్ !" అన్నాడు వాడు.

సరే ! మళ్లీ పాదయాత్ర తప్పలేదు. బ్రహ్మాండమైన ఇళ్లు కనుపిస్తున్నాయి. కాలనీల మీద కాలనీలు లేచి పోతున్నాయి !

"అదుగో, అటు చూడరా, అక్కడేదో చిన్న బోర్డున్నది" ఆశగా చెప్పాడు బ్రహ్మానందం.

అటు చూశాను. 'నిజమేరోయ్' అనిపించింది. బోర్డుకూడా దూరంనుంచి ముచ్చటగానే వుంది. ఇల్లుకూడా బంగారంలాగా వుంది. ఆహా! ఈ రూమే దొరికితే, "స్వర్గం, వైకుంఠం .... ఓహో !" అనుకున్నా మనసులో !

తీరా పోయి చూద్దును—రూములేవు సరి గదా, ఇంకేవో వున్నాయట! "కుక్కలున్నాయ్, జాగ్రత్త" అని వుంది ఆ బోర్డుమీద.

"ఛీ ! ఛీ !" అనుకొని మరో రెండడుగులు ముందుకు వేశాం. పెంకుటిల్లు కనుపించింది. బోర్డు లేదు ! కనీసం ఒక 'రూము' దొరక్కపోతుందా? అనుకొని లోపలికెళ్లాం.

మా బ్రహ్మానందమే పిలిచాడు : "ఏమండోయ్! ఏమండోయ్". మా వాడి కేక విని లోపలి నుంచి ఎవరో వచ్చారు. మనిషి బాగా బొద్దుగా వున్నాడు—నడికారు మనిషి. "అయ్యా ! ఇక్కడ రూములేవైనా వున్నాయా ?" నేనే అడిగా మెల్లిగా.

"రూము కావాలా ? ఏవూరు మంది ?" ఆయనడిగాడు.

ఫలానా అని చెప్పాం.

"ఏం చేస్తున్నారు ?"

"ఫలానా ఉద్యోగం" అని చెప్పాం.

"పెళ్లి, గిళ్లి అయిందా."

"అబ్బె ! పెళ్లయితే రూమేం ఖర్మ ! ఫేమిలీ పోర్షన్ తీసికొనే వాళ్లం గదండీ !" అన్నాం.

"అయితే లేవు పొండి ! ఎవరయ్యా మీరు? ఈ వూరికి కొత్తా, బాచ్‌లర్స్ నా ఇంటి గడప తొక్కకూడదని తెలీదేంటి ? నడవండి ! నడవండి !"

ఆయన ఆజ్ఞ ప్రకారం, బయటికి నడవక తప్పలేదు. ఆయన మాటలు వినేసరికి బ్రహ్మానందానికి మూర్ఛ వచ్చినంత పనయింది.

"ఏమిట్రా ఈ ఖర్మ" అడిగాడు బ్రహ్మానందం.

"తప్పదు భాయ్ !" ఏదో సర్ది చెప్పాను.

మా సంభాషణను ఎవరో పుణ్యాత్ముడు రోడ్డు మీద నిలబడి విని, మమ్మల్ని పిలిచాడు :

"చూడండిసార్ ! రూములు కావాలా మీకు, ఇది కాక పై సందు తిరగండి. నాయుడుగారి యిల్లెక్కడా అనడగండి. వాళ్లింట్లో ఉన్నయ్ చాలా రూములు" అని చెప్పాడు.

పిడెవడో పాత కాలపు మనిషి కాబోలనుకున్నాం, ఆ ధర్మాత్ముణ్ణి చూపి ఒకటికి రెండుసార్లు నా

న్యారం పెట్టి, నాయుడుగారింటికోసం వెతుకుతూ బయల్దేరాం.

ఆ ఇల్లు తీరా, దానే వచ్చింది. వాకిట్లో పైన్ బోర్డుకూడా ఉంది. "ఫలానా నాయుడుగారు" అని. లోపలి కెళ్ళాం. అడిగాం. 'నాయుడుగారున్నారా ?' అని.

ఎవరో ఆజాను బాహువు, 50 ఏళ్ళ వయస్సు గల వ్యక్తి, ఉక్కుపిండంలా ఉన్నాడు, బయటికొచ్చి "ఎవరయ్యా, మీరు?" అనడిగాడు.

బ్రహ్మానందం ఇలాంటి సమస్యను పరిష్కరించటంలో రాటు తేలిన వాడు. ఇంటి యజమానులతో ఎలా మాట్లాడాలో, రూం దొరక్కముందు ఎలా వినయ విధేయతలతో ఉండాలో, దొరికింతర్వాతి 'హక్కులు' ఎలాంటివో అతనికి బాగా తెలుసు ! నిజం చెప్పాలంటే ఆ హక్కులను చెప్పదల్చేగా ఇప్పుడున్న చోట ఖాళీ చేయమన్నది!

అమాంతం నాయుడిగారి చేతులు పట్టుకున్నాడు బ్రహ్మానందం ! "సార్, మీ బిడ్డలాల్లాంటి వాళ్ళం. మీరు తండ్రిలాంటి వాళ్ళు. మాలాంటి వారికి 'రూము' ఇచ్చి మీరు ఆదుకొంటుంటారని విని రెక్కలు గట్టుకొని వచ్చాం" అన్నాడు బ్రహ్మానందం.

నాయుడుగారు విస్తుపోయినా, చలించలేదు. ఆయనే చెప్పాడు అనునయంగా :

"బేష్ ! బుద్ధిమంతుల్లానే ఉన్నారు. కాని ప్రస్తుతం రూములేమీ లేవు. కాకపోతే 'రేకుల షెడ్డు' మాత్రం ఉంది. నానాకాలమేగా, రేకు అయితే ఏం, బంగారమయితేనేం ! మీ కభ్యంతరం లేకపోతే చూడొచ్చు" అన్నాడు.

రేకుల షెడ్డే అయినా, ఒక మోస్తరుగా ఉంది. నాయుడుగారు పూర్వాశ్రమంలో అక్కడ తన కారును ఉంచేవాడట. దాన్నే ప్రస్తుతం ఈ కుర్రకారు కోసం కేటాయించాడు.

"అయ్యా ! మరి, అద్దె మాట సెలవిచ్చారుకాదు!" అడుగులకు మడుగులొత్తాడు బ్రహ్మానందం.

"ఆ ! అదే చెప్పబోతున్నాను. ఇద్దరం ఉంటామన్నారుగా .... చూడబోతే బుద్ధిమంతుల్లా ఉన్నారు. మీకోసం కాబట్టి నలభై రూపాయలు నెలకు.... మొన్నటిదాకా ఏభై రూపాయలు వసూలు చేసేవాళ్ళం." అన్నాడాయన.

ఈ మహానగరపు వాతావరణాన్నిబట్టి చూస్తే, 'రూము' అనే పదార్థం దొరికినందుకే ఇచ్చేచ్చు వాలుగు నలభైలు అనిపించింది.

"మరి, తతిమ్మా రూల్సు చెప్పారుగాదు ?"

"రూల్సే అంటూ ఏమున్నాయ్. రాత్రి తొమ్మిది దాటాక బయటుగేటు తాళం వేస్తాం. నీళ్లుతెచ్చే పని మనిషికి నెలకు, తలకు అయిదు రూపాయ లివ్వాలి? గదివూడ్చేవాడికి రెండురూపాయలు .... ప్రతి ఏడాదీ సున్నంఖర్చు ... అంతా మీదే .... ఎప్పుడు పడితే అప్పుడు వరండాలో నడవకూడదు. ప్రతి శని, ఆది వారాలు మా అల్లుడు ఇక్కడకే వస్తాడు. ఆయన ఈ ఇంట్లో ఉన్నప్పుడు మీ రిక్కడున్న చప్పుడే కాకూడదు. పాటలు పాడటం, ధూమపానం అలాంటివి పనికిరావు.... తెలిసిందేగా .... రెండు నెలల అద్దె అడ్వాన్సుగా ఇవ్వాలి?.... ఇంతే ...." అన్నాడాయన.

ఇది వినేసరికి నా మటుకు నాకు పై ప్రాణాలు పైనే పోయాయ్ ! బ్రహ్మానందం మాత్రం బ్రహ్మానందభరితుడైనట్లు కనుపించాడు. పైగా "వో. యస్. అలానే మాష్టారూ. రేపొద్దున్నే వర్షం రాకముందే వచ్చి చేరతాం. వస్తూనే రెండు నెల్లు కాదు, మూడు నెల్ల అద్దె మీ చేతిలో పెడతాం" అన్నాడు. వాడి మాటలు వినేసరికి నాకు భయం వేసింది నిజమేమోనని !

బయటికొచ్చాక అడిగాను "ఎందుకురా ఈ దిక్కుమాలిన గ్యారేజిలో"నని.

"నువ్వూ, నేను కాదుగదా ! కుక్కలు, నక్కలు కూడా ఉండవ్. ఇందులో" అన్నాడు బ్రహ్మం.

పైగా నాయుడుగారి దగ్గర మొహమాటంకోసం అలా అన్నాడట బ్రహ్మానందం. లేకపోతే చివాట్లు తప్పవ్, ఆయన చేతిలో.

మళ్లీ ప్రారంభించాం పాదయాత్ర. "ఇవాళ్టికి రూముకి పోదాం, ఆకలిగా ఉందిరా బ్రహ్మానందం?" అని ఎంత బ్రతిమలాడినా వాడు వినలేదు. 'రూము దొరకాలి, ఇంటి కెళ్ళాలి" అనే వాడి పంతం.

నడిచాం, నడిచాం మరో మైలు, "గది అద్దె కివ్వబడును" అనే మరో బోర్డు కనుపించింది. మళ్లీ కథ ప్రారంభం; మళ్లీ ఆశలు చిగురించాయి.

మా బ్రహ్మానందమే మొదలెట్టాడు. ఇంటి యజమానితో : 'అయ్యా, మీ పేరు ఒకటికి నాలుగుసార్లు వినివచ్చాం, తమరు దయామయులనీ— నోరు తెరిచి అడిగిన వాడికి, కాదనకుండా 'రూము' లిస్తారని విని వచ్చాం. ఇక మీ దయ. బుద్ధిమంతులం. మీరే చూస్తారుగా ?"

నోనరుగారు చిరునవ్వుతో సమాధానం చెప్పారు : 'సెహభాష్ ! మీలాంటివాళ్ళే నేటి భారతదేశానికి కావాలోయ్ ! మీక్కావలసింది రూమేగా ! రూమేం ఖర్మ 'రూం' ముందర వరండా కూడా మీకే ఇస్తాం. కాని, చిన్న సంగతి.... నాది స్వతహాగా పరోపకార బుద్ధి. నాయనా! నా ఇంట్లో ఉండే మీలాంటి వాళ్ళు కూడా అలానే ఉండాలని నా అభిప్రాయం."

"ఏమిటి అద్దెమాట చెప్పారుగాదు ?" మధ్యలో బ్రహ్మానందం గొణిగాడు.

మళ్లీ ఆ ఇంటి యజమాని ప్రారంభించారు :

"అద్దెదేముందోయ్ ! చెరి పదిహేనివ్వండి. పోనీ, చెరీ పదివ్వండి. నే చెప్పానుగా కాస్త పరోపకారం చేసిపెట్టాలి ... ఏం లేదు, ప్రొద్దున్నే నిద్ర లేవాలి మీ పనులన్నీ అయ్యాకలేండి .... మా ఆవిడ దగ్గర చిల్లర డబ్బులు తీసికొని మార్కెట్టుకెళ్లి కూరగాయలు తెచ్చిపెట్టటం, ఆ తరువాత మా అమ్మాయిని (పెద్దమ్మాయిని కాదు, చిన్న పాపాయిని) ఎలిమెంటరీ స్కూల్లో దిగబెట్టటం చాలు. సాయంత్రం కొళాయి రాకపోతే, మాతిలో నీరు కాసింత తెకాసినే తోడిపెట్టాలి. ఇదంతా పరోపకారం క్రైనింగోయ్! ఏం, ఎప్పుడు దిగుతారు రూములోకి ....?"

ఆ మాటలు వినేసరికి పరోపకారం సంగతి భగవంతు డెరుగు .... త్వరలో అక్కడినుంచి బయటపడకపోతే మాకే అపకారం అనిపించింది.

బ్రహ్మానందం మామూలు ధోరణికో చెప్పాడు— "ఆహా ! దివ్యం ! దివ్యం ! ధన్యాత్ములు మీరు. ఇవ్వాళే రూములో చేరతాం. కాస్త చీకటిపడ్డాక అమ్మాయి రాకముందే చేరుతాం" అని చెప్పేసి, 'అమ్మయ్య' అని బయటపడ్డాం ! బయటికి నడిచాక, అరగంట వరకు నవ్వేసరికి ఆకలి ఎక్కువయింది !

"ఒరే బ్రహ్మానందం ఆకలిరా ? ఆకలిరా ?" అన్నాన్నేను.

"రూమురా ! రూము" అంటాడు వాడు.

రూము దొరకందే ఇంటికి వద్దంటాడు వాడు. ఇదీ సంగతి.

మళ్లీ ప్రారంభించేం పాదయాత్ర, ఇంకా దొరకలేదు రూము. నా కాళ్ళు నడుస్తూ ఉన్నాయ్ ! బ్రహ్మానందం నోరు మాట్లాడుతూనే ఉన్నది.

(కల్పితం)★

